క్లుప్తంగా

తాగునీరు వృథా



రహదారిపై వృథాగా పోతున్న తాగునీరు

ఏలేశ్వరం: ప్రజల దాహార్తి తీర్చే తాగునీరు పట్టణంలో వృథాగా పోతుండటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సాయిబాబా మెట్ట మీద ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి తాగునీరు సమీపంలోని రహదారి మీదుగా వృథాగా పోతుంది. ఈ ట్యాంక్‌లో ఉన్న నీటిపై వందలాది మంది ఆధారపడి ఉన్నారు. కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతున్నా పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వృథాగా పోతున్న తాగునీటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

డ్రోన్ సాయంతో పిచికారీ



డ్రోన్ సాయంతో పొలంలో కషాయాలు పిచికారీ

గోకవరం: మండలంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న వరి పంటలపై ఆశించే తెగుళ్లు, పురుగులను అరికట్టడానికి డ్రోన్ సాయంతో కషాయాలను పిచికారీ చేయిస్తున్నామని మండల ఎమ్‌టీఎల్ బసవన్న గౌడ్, ఎమ్‌టీ దేవి తెలిపారు. రంపఎర్రంపాలెం, కామరాజుపేట యూనిట్ల పరిధిలో పెంటపల్లి, రంపఎర్రంపాలెం, గోకవరం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వరి చేలుపై వేపపిండి కషాయం, పాల ఇంగువ, చేపబెల్లం ద్రావణం కలిపి 25 ఎకరాల్లో పిచికారీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది యూనిట్ ఇన్‌చార్జ్‌లు సౌజన్య, ఉమాదేవి, ఐసీఆర్పీ సూర్యకుమారి, దొరబాబు, రైతులు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని కుమార రామభీమేశ్వరస్వామి

సామర్లకోట: ప్రసిద్ధగాంచిన పంచారామ క్షేత్రంలో స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు భాద్రపత మాసం, నవమి సోమవారం కావడంతో ఆలయంలోని కుమార రామభీమేశ్వరస్వామికి, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉప ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామి వారి తొలి అభిషేకానికి క్యూలైనులో భక్తులు వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ధ్వజ స్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలోని నీటితో అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. పూజలు అనంతరం స్వామి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్థానిక మఠం సెంటర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో, గొంచాలలోని శివాలయంలో, పీబీ దేవం శివాలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

వృద్ధుడిపై సచివాలయ ఉద్యోగిని ఫిర్యాదు

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరానికి చెందిన వృద్ధుడిపై సోమవారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ధర్మవరం సచివాలయ ఉద్యోగిని తుర్రం రాధిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జగన్నాథరాజు చిరునామా కోసం రామరాజు (86)ని అడిగారు. ఇదే నివాసమంటూ తనను లోపలికి రమ్మంటూ అసభ్యంగా ప్రవర్తించాడని ఆమె ప్రత్తిపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారణ చేపడతామని స్థానిక ఎస్సై లక్ష్మీకాంతం చెప్పారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం

పెద్దాపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు డివిజన్‌లో ఆయా మండలాల నుంచి నాలుగు అర్జీలు అందినట్లు ఆమె తెలిపారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, గృహ నిర్మాణ శాఖ రవిశంకర్ పాల్గొన్నారు.

జల్‌జీవన్.. నిలిచెన్!

- నత్తనడకన పనులు
- బిల్లుల మంజూరులో జాప్యం
- గ్రామాల్లో తప్పని తాగునీటి వెతలు

రౌతులపూడి: జల్ జీవన్ మిషన్ (జేజేఎం) పనులు మండలంలో పడకేశాయి. ఈ పథకం వల్ల తాగునీటి వనరుల సద్వినియోగం, తలసరి నీటి వినియోగ పరిమాణం పెంపుదల, నూరుశాతం రక్షిత మంచినీటి సరఫరా జరుగుతుందని భావిస్తే.. కూటమి ప్రభుత్వ తీరు వల్ల పథకం ఉద్దేశమే నీరుగారుతోంది. బిల్లుల చెల్లింపుల జాప్యం కారణంగా పనులు సక్రమంగా జరగట్లేదని స్థానికులు అంటున్నారు.

తాగునీరు అందని పరిస్థితి

ఇంటింటికీ కుళాయిల ద్వారా రక్షిత తాగునీటి జలాన్ని అందించాలని గత ప్రభుత్వంలో ప్రారంభించిన జల్ జీవన్ మిషన్ పనులు మండల వ్యాప్తంగా నత్తనడకగా సాగుతున్నాయి. త్వరితగతిన పనులు చేపట్టకపోవడంతో గ్రామాల్లోని ప్రజలకు ఇంటింటి కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామాల్లో ఉన్న మంచినీటి ట్యాంకులు, చేతిపంపుల ద్వారానే తాగునీరు అందిస్తున్నారు. ఇంటి కుళాయి పనులు పూర్తిచేసి ఇంటింటికీ రక్షిత తాగునీరందివ్వాలని ప్రజలు కోరుతున్నారు.

పథకం నిర్వహణ ఇలా..

మండలంలో 26 పంచాయతీలు ఉండగా జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయాల్సి ఉంది. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 63 పనులకు రూ.16.17 కోట్ల నిధులను మంజూరు చేశారు. వీటిలో 16 చోట్ల మాత్రమే పనులు పూర్తి చేశారు. మిగిలిన 47 చోట్ల ఇంకా పనులు కొనసాగుతున్నాయి. దశల వారీగా మంజూరైన ఈ పనులు జూన్ నాటికి పూర్తి కావాల్సి ఉంది. కాగా, బిల్లుల మంజూరులో జాప్యం కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. రౌతులపూడి, ములగపూడి, బీబీ పట్నం, సబ్‌ప్లాన్ ఏజెన్సీలోని చాకిరేవుల పాలెం, డి.పైడిపాల తదితర గ్రామాల్లో ప్రజల అవసరాలకు తగినట్టుగా ట్యాంకుల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి. అయినా ఆయా గ్రామాల్లో పనులు పూర్తి చేయకపోవడంతో రక్షిత మంచినీటి జలాల కోసం ప్రజలు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. ఎస్.పైడిపాల, బలరామపురం, శృంగవరం గ్రామాల్లో ట్యాంకు పనులు చేసినా ఇంకా పైపులైన్లు, కుళాయిలు ఏర్పాటు చేయలేదు.



బలరామపురంలో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకు



బలరామపురంలో మురికి కాలువలో ఉన్న మంచినీటి కుళాయి



ఎస్సీ పేటలో చేతిపంపు నుంచి నీళ్లు రాక ప్రజల ఇబ్బందులు

పనులు ప్రారంభించాలి

జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా మంజూరైన ఇంటింటికీ మంచినీటి కుళాయిల పనులు చేయకపోవటంతో గ్రామంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా స్థానిక ఎస్సీ పేటలోని ప్రజలు తాగుతున్న ప్రస్తుత మంచినీటి బావుల్లోని నీరు కలుషితమవ్వటంతో గత వారం రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కలుషితమైన నీటిని తొలగించి మంచినీటి బావులను అందుబాటులోకి తీసుకురావాలి. ఈ పథకంలో మంజూరైన ఇంటింటికీ కుళాయిలు పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

– కొంకిపూడి రాజ్యలక్ష్మి, ఎయిమ్స్ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు, బలరామపురం

పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం

మండల వ్యాప్తంగా చేపట్టిన జల్‌జీవన్ పనులు బిల్లులు మంజూరులో జాప్యం కారణంగా ఆలస్యంగా జరుగుతున్నాయి. వచ్చే మార్చి 2026కు ఈ పనులన్నీ పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలున్నాయి. ఈ మేరకు మండలంలోని జల్‌జీవన్ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాం.

– గౌతం కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, రౌతులపూడి

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

జగ్గంపేట: మండలంలోని పోలీస్ సర్కిల్‌లో చైన్ స్నాచింగ్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనివాస్ తెలిపారు. దీనిపై పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలు, యువతులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. వీధుల్లో నిర్మానుష్యంగా ఉన్న సమయాల్లో మహిళలు ఒంటరిగా వెళ్లడం సరికాదని పేర్కొన్నారు. చైన్ స్నాచింగ్ ముఠాలు ఇలాంటి వారినే టార్గెట్ చేస్తారని చెప్పారు. చైన్ స్నాచింగ్ జరిగే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. కొద్ది రోజులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న చైన్ స్నాచింగ్ సంఘటనలపై పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

15న రాష్ట్ర లేబర్ కార్యాలయం ముట్టడి

పిఠాపురం: విజయవాడలో సెప్టెంబర్ 15న రాష్ట్ర లేబర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్మాణరంగ కార్మికులు జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి నందీశ్వరుడు పిలుపునిచ్చారు. సోమవారం చేబ్రోలులో నిర్వహించిన సీతారామ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని, 12 14 జీఓను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేసారు. ఈ నెల 15న విజయవాడ రాష్ట్ర లేబర్ ఆఫీస్ ముట్టడిని కార్మికులందరూ జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కిర్లంపూడిలో గిరిబాబును కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులంతా కష్టపడి పనిచేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసానికి రౌతులపూడి మండలం గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం వచ్చి ఆయనను, గిరిబాబును కలిశారు. వారితోపాటు ఏలేశ్వరం మండలం భద్రవరానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కలిసి ముద్రగడ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

భూసమస్యలు పరిష్కారించాలని ధర్నా



ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న నాయకులు

ఏలేశ్వరం: మండలంలో నెలకొన్న భూ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ పట్టణంలో సోమవారం సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. గణేష్ మాట్లాడుతూ, నగర పంచాయతీలో ఏలేరు ప్రాజెక్టు మిగులు భూమి పేదలకు పంచాలని హైకోర్టు తీర్పు ఇచ్చినా ఇప్పటివరకు అధికారులు స్పందించలేదన్నారు. జె.అన్నవరం గ్రామంలో ల్యాండ్ సీలింగ్ భూమిని అక్రమించుకున్న భూస్వామి నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గండేటి పెదనాగమణి, గుమ్మడి పాదాలమ్మ, కందుల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదాన పక్షోత్సవ ర్యాలీ



ప్రత్తిపాడులో ర్యాలీ చేస్తున్న సీహెచ్‌సీ సిబ్బంది

ప్రత్తిపాడు: జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌సీ వద్ద ఈ ర్యాలీని సూపరింటెండెంట్ సౌమ్య మైఖేల్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, నేత్ర దానం చేయడం ద్వారా ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చన్నారు. వయసుతో సంబంధం లేకుండా బీపీ, డయాబెటీస్ ఉన్నా సరే నేత్ర దానం చేయవచ్చన్నారు. కంటిలో నల్లగుడ్డు సమస్యలతో బాధపడేవారికి నేత్ర దానం చేయడం వల్ల చూపును అందించవచ్చని పేర్కొన్నారు. వ్యక్తి మరణించిన అరగంట నుంచి గంటలోపు కుటుంబీకులు సమాచారం అందిస్తే సిబ్బంది వచ్చి నేత్రాలు సేకరిస్తారని తెలిపారు. ఈ ర్యాలీలో సీహెచ్‌సీ వైద్యులు వినీల, రఘురామ్, సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

పెద్దాపురం: మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ వంటి చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని పెద్దాపురం సీఐ విజయ్‌శంకర్ అన్నారు. దివిలి కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్సై మౌనిక అధ్యక్షతన సోమవారం మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్ రహదారి భద్రతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విజయశంకర్ మాట్లాడుతూ, శాంతియుత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యను దూరం చేస్తే ఉద్యమిస్తాం



కళాశాల యాజమాన్య తీరుపై అఖిల భారత విద్యార్థి సభ్యుల నిరసన

తుని: డిగ్రీలో బీకాం గ్రూపు ఉందని విద్యార్థులను కళాశాలలో చేర్పించుకొని, ఇప్పుడు కోర్సు లేదంటూ వారిని విద్యకు దూరం చేస్తే ఉద్యమిస్తామని అఖిల భారత విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ చందు అన్నారు. సోమవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తుని శాఖ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో యాజమాన్యం డిగ్రీ మొదటి ఏడాది విద్యార్థులకు విద్యను దూరం చేయాలనుకుటుంన్న నేపథ్యంలో కళాశాల యాజమాన్య తీరుపై నిరసన తెలిపారు. చందు మాట్లాడుతూ, ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులను బీకాం కంప్యూటర్స్ గ్రూప్ ఉందని చేర్పించుకున్నారన్నారు. రెండు నెలలు గడిచిన తర్వాత ఇప్పుడు ఆ గ్రూప్ తొలగిస్తున్నామని మేనేజ్‌మెంట్ ప్రకటించిందన్నారు. ఈ విషయంపై గతంలో విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్లి అడిగినా కళాశాల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ వ్యహారంపై కళాశాల యాజమాన్యం స్పందించకుంటే ఉద్యమిస్తామన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



పొన్నాడలోని గ్రామ సభలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు పథకాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తోందని ఆయన అన్నారు. ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ వంగా గీత ఆదేశాలతో మండలంలోని పొన్నాడ శ్రీరాంపురం, రమణక్కపేటలో సోమవారం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కంబాల యాకబ్, కడారి సతీష్, పెనుమల్లు పాపిరెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పూర్తిస్థాయిలో అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పథకాల అమలులో పార్టీల పేరుతో వివక్ష చూపరాదని అన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కారే శ్రీనివాసరావు, జ్యోతుల బాబులు, కాదులూరి నేరేళ్లరెడ్డి, యాదల నాగేంద్ర, కారే కిరణ్, బండి సత్తిబాబు, కొయ్య స్వామి, యాదల శివ, కాళ్ల గోవిందు, మెరుగు ఆనందరావు, చెట్లూరి రాము, సాక చిన్నబ్బాయి, మేక నాని పాల్గొన్నారు.

సందడిగా నిమజ్జనాలు



కుమ్మరివీధిలో కోలాటం చేస్తున్న చిన్నారులు



పుష్కర కాలువ వద్ద వినాయకుడి విగ్రహాల నిమజ్జనాలు పర్యవేక్షిస్తున్న సీఐ

రౌతులపూడి: మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. మండలంలోని ఎస్.పైడిపాల, గిడజాం, రౌతులపూడి, బలరామపురం, ఎ.మల్లవరం, గంగవరం, శృంగవరం, బంగరయ్యపేట, లచ్చిరెడ్డిపాలెం తదితర గ్రామాల్లోని గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో బాణసంచా, మంగళవాయిద్యాలు. తీన్‌మార్లతో స్వామివార్లను వైభవంగా ఊరేగించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిన్నారుల కోలాటం

కిర్లంపూడి: మండలంలోని గణపతి నవరాత్రులు పురస్కరించుకొని ఆదివారం రాత్రి కుమ్మరి వీధి, రమణయ్యపేటలోని వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన కోలాట నృత్య ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. రమణయ్యపేటలోని బాల వినాయకుడి మండపం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

సంప్రదాయంగా గణేశుని నిమజ్జనం చేయాలి

శంఖవరం: హిందూ సాంప్రదాయం ప్రకారంగా గణేశుని నిమజ్జన వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా గణేష్ ఉత్సవ సమితీ అధ్యక్షుడు యేనిమిరెడ్డి మాలకొండయ్య అన్నారు. మండలంలోని కత్తిపూడి బచ్చి సీతయమ్మ సత్రంలో సోమవారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహ కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, శాంతియుత వాతావరణంలో భక్తి గీతాలతో భజనలు చేస్తూ స్వామిని నిమజ్జనం చేయాలన్నారు. డీజేలు, మద్యం సేవించి ఊరేగించడం సాంప్రదాయం కాదన్నారు. పోలీసులు రక్షణ కల్పించి వివాదాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్తిరాజు, చిరంజీవి తదతరులు పాల్గొన్నారు.

అన్నదానం

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లి త్రిమూర్తుల దేవాలయం వీధిలో వినాయక చవితిని పురష్కరించుకుని కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పుర వీధుల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి గణేషుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా వినాయక విగ్రహన్ని ఏర్పాటుచేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సందడి

జగ్గంపేట: వినాయక చవితి పూజలు అందుకున్న గణపతులు 5 రోజులు పూర్తికావడంతో నిమజ్జనానికి బయులుదేరుతున్నారు. గ్రామాల్లో నిమజ్జనాల సందడి మొదలైంది. ఊరేగింపులతో గణపతులను వాహనాలపై స్థానికంగా ఉన్న చెరువులు, కాలువల వద్దకు చేర్చి నిమజ్జనం చేస్తున్నారు. జగ్గంపేట మండలంలో పోలీసులు నిర్దేశించిన ప్రాంతాల్లో గణపతి విగ్రహాలు నిమజ్జనం చేయాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. జగ్గంపేటలోని పుష్కర కాలువ వద్ద గణపతి విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాన్ని ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు.

ఏలేశ్వరం మండలంలో..

ఏలేశ్వరం: గణపతి నవరాత్రుల ముగింపులో భాగంగా సోమవారం గణేష్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, యర్రవరంలోని పలు ప్రాంతాల్లో వినాయకుని విగ్రహాలను ఊరేగించారు. విగ్రహాలను నెలకొల్పిన మండపాల నుంచి ప్రత్యేక వాహనాల్లో బాణాసంచాతో పాటు తీన్మార్ తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెన్షన్ నిరుపేదలకు భరోసా

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లిలో సోమవారం పింఛన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. పింఛన్ నిరుపేదలకు భరోసాగా నిలుస్తుందన్నారు. మంచానికే పరిమితమైన లబ్ధిదారులు వీర బ్రహ్మానందం, అనుకుల విజయ్ కుమార్, పంచకట్ల కాటమరాజు తదితరులకు పింఛన్ అందజేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ కుంచే రాజా, పుష్కర చైర్మన్ అడబాల భాస్కరరావు, మాజీ వైస్ ఎంపీపీ పోతుల మోహన్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి వెంకటలక్ష్మి బాబ్జి, ఎంపీడీఓ చంద్రరావు తదితరులు ఉన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ

జగ్గంపేట: రేషన్ పంపిణీ వ్యవస్థను నూతన సాంకేతిక మార్పులతో పకడ్బందీగా నిర్వహించడానికే ప్రభుత్వం స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని రామవరంలో సచివాలయం-1 వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖుడు అడబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.